## క్లుప్తంగా

### అంధుల పాఠశాలకు బీరువా బహూకరణ



బీరువాను, ఫ్లాస్క్‌లను అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ రాంబాబు

**మామిడికుదురు:** అమలాపురం పట్టణంలోని లూయి అంధుల పాఠశాలకు మగటపల్లికి చెందిన నామన ఫౌండేషన్ ద్వారా శనివారం రూ.25 వేలు విలువైన బీరువాను బహూకరించారు. దీంతో పాటు పాఠశాలలో చదువుకుంటున్న 25 మంది విద్యార్థులకు వాటర్ కూలింగ్ ఫ్లాస్క్‌లను అందజేశారు. వీటిని నామన కృష్ణవేణి స్మారకార్థం ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు, డాక్టర్ నామన వినోద్ పాఠశాల మేనేజర్ రామాయణం శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో బండారు రామమోహన రావు, మట్టా సాయి రామారావు, మట్టా చిట్టిబాబు, దాసం సురేష్, రంకిరెడ్డి బుజ్జి, తిరుమనాధం మురళీకృష్ణ పాల్గొన్నారు.

### గంధర్వాశ్వ వాహనంపై గ్రామోత్సవం



మాకనపాలెంలో స్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్త దంపతులు

**మామిడికుదురు:** మాకనపాలెంలో వేంచేసిన అనంతలక్ష్మి, భూదేవి సమేత సత్యనారాయణ స్వామి వారి 72వ వార్షిక దివ్య తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గంధర్వాశ్వ వాహనంపై ఊరేగిస్తూ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ జరిగిన ఈ ఉత్సవంలో పలువురు భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయం జరిగిన స్వామి వారి వ్రతాల్లో 125 మంది భక్త దంపతులు కర్తలుగా పాల్గొన్నారు. స్వామికి భక్తులు అభిషేకాలు చేయించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. కల్యాణోత్సవాల సందర్భంగా స్వామి వారి ఆలయం భక్తులతో కోలాహలంగా మారింది. ఉభయ దేవేరులతో కొలువుదీరిన స్వామిని దర్శించుకున్న భక్తులు తన్మయత్వం పొందారు.

### అనారోగ్య బాధితుడికి రూ.23 వేల సాయం



బాలుడి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

**రావులపాలెం:** అనారోగ్యంతో బాధపడుతున్న బాలుడి వైద్యం కోసం ఆ కుటుంబానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.23 వేల ఆర్థిక సాయం అందజేశారు. అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామానికి చెందిన లంక గౌతమ్ అనే ఐదేళ్ల బాలుడికి బ్రెయిన్లో ఇన్ఫెక్షన్ వచ్చి నిమిషానికి 3 సార్లు ఫిట్స్ వస్తున్నాయి. కుటుంబ సభ్యులు వైద్యం కోసం రాజానగరం ప్రైవేట్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. ఈ బాలుడికి చేయాల్సిన ఇంజక్షన్ ఒక్కొక్కటి రూ.80,000 ఉండటంతో అంత స్తోమత లేని ఈ కుటుంబానికి ఊరిలో ఎవరికి తోచిన సహాయం వారు చేస్తున్నారు. దీంతో కుటుంబ సభ్యులు మహేంద్రవాడలో కాశీ అన్నపూర్ణ దేవి సేవా సంస్థ సభ్యులను సహాయం కోరగా శనివారం సంస్థ సభ్యులు చేతుల మీదుగా గౌతమ్ కుటుంబ సభ్యులకు రూ.23 వేల ఆర్థికసాయం అందజేసినట్టు సేవా సంస్థ సభ్యులు తెలిపారు.

### వెంకన్న విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

**అంబాజీపేట:** ఇసుకపూడి శివారు జక్కంశెట్టి వారిపాలెంలో ఈ నెల 27న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. బ్రహ్మశ్రీ ఎస్ఎస్‌వీవీఎల్ఎన్ శర్మ (బుజ్జి) పర్యవేక్షణలో శనివారం క్షేత్రపాలక మండపారాధన, హోమాలు, క్షేత్రాపాలక బలి పూజలను చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### ముగ్గురు విద్యార్థుల గైర్హాజరు

**అంబాజీపేట:** మండలంలో మూడు కేంద్రాల్లో జరుగుతున్న పదో తరగతి భౌతిక శాస్త్రం పరీక్షలకు ముగ్గురు విద్యార్థులు గైర్హజరైనట్లు ఎంఈఓ కాంథ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. అంబాజీపేట నుంచి 143 మందికి 142, తొండవరం నుంచి 159 మందికి 158, పుల్లేటికుర్రు నుంచి 187 మందికి 186 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. మూడు కేంద్రాల నుంచి ఒక్కొక్కరి చొప్పున పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవోలు తెలిపారు.

# ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయండి

- రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, బీఎల్ఓలకు అవగాహన
- ప్రజా చైతన్య ర్యాలీ, మానవహారం



కొత్తపేటలో ఓటు వినియోగంపై ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ ఎలీషా, ఎంపీడీఓ వాణి

**కొత్తపేట:** జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటును వినియోగించుకోవడం ద్వారా ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలని తహసీల్దార్, ఏఈఆర్వో జి.ఎలీషా, ఎంపీడీఓ కె.వాణి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి సూచించారు. 'ఓటరు విద్య – ఎన్నికల్లో భాగస్వామ్యం' స్వీప్ పేరిట శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, సచివాలయాల సిబ్బంది, బీఎల్వోలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఓటరు ఓటు హక్కు వినియోగం, ప్రజా చైతన్యం తదితర అంశాలపై తహసీల్దార్ ఎలీషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ఓటుతో ప్రజాస్వామ్యాన్ని ప్రగతి బాటలో నడిపించాలన్నారు. బలమైన ప్రజాస్వామ్యం ఓటింగ్ శాతం పెంపుతోనే సాధ్యమన్నారు. ఓటు గొప్ప ఆయుధమని, ఆ ఓటే దేశ భవిష్యత్‌ను నిర్దేశిస్తుందన్నారు. కులం, మతం, వర్గం, జాతి వంటి వాటికి ప్రభావితం కాకుండా ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. ఎంపీడీఓ వాణి మాట్లాడుతూ గత ఎన్నికల్లో పోలైన ఓటింగ్ శాతాన్ని మించి ఈసారి ఓటింగ్ శాతం పెరగాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామ, సచివాలయాల స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల కోడ్ ఎక్కడా ఉల్లంఘన కాకుండా చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో తమ దృష్టికి రాకుండానే నిశితంగా గమనించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం 'ఓటు హక్కు వినియోంచుకుందాం.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిద్దాం' తదితర నినాదాలతో గ్రామ పురవీధుల్లో, మెయిన్‌రోడ్డుపై మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, ఈఓపీఆర్డీ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు వీవీ రామన్, మంగిపూడి రాంబాబు, పి.సత్తిబాబు, శాంతి, రాజేశ్వరి, ఎస్.హరిప్రసాద్‌బాబు, వీఆర్వోలు శ్రీను, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### ఓటు హక్కుపై ప్లకార్డులతో అవగాహన

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుపతి వాడపల్లిలో శనివారం తహసీల్దార్ ఎం.వెంకట రామయ్య వినూత్నంగా ప్లకార్డులతో ఓటు హక్కుపై భక్తులకు అవగాహన కల్పించారు. ఓటర్లకు నిష్పక్షపాత, బాధ్యతాయుతమైన మీ ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్లకార్డులతో నినాదాలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా మంచి నాయకులను తయారు చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ భవాని, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'చిర్ల'తో ప్రయాణిస్తాం..

# మళ్లీ పార్టీని గెలిపిస్తాం

- టీడీపీ, జనసేన పార్టీలకు పలువురి రాజీనామా
- ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిక



కొత్తపేటలో పార్టీలో చేరిన నాయకులకు పార్టీ కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

**కొత్తపేట:** ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ, ఎప్పుడూ అందుబాటులో ఉండే ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డితోనే ఇకపై ప్రయాణం చేస్తాం.. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపిస్తాం.. అని కొత్తపేట శివారు పెదగూళ్లపాలెం గ్రామస్తులు ముక్తకంఠంతో మాటిచ్చారు. ఇంతవరకూ టీడీపీ, జనసేన పార్టీల్లో కొనసాగిన ఆ గ్రామ శెట్టిబలిజ సామాజిక వర్గం నాయకులు, కార్యకర్తలు ముకుమ్మడిగా ఆయా పార్టీలకు రాజీనామా చేసి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరేందుకు ముందుకు వచ్చారు. శెట్టిబలిజ సంఘ నాయకులు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో 65 ఏళ్లు దాటిన ముసలివాళ్లకు పింఛన్ కావాలన్నా, అర్హత కలిగిన కుటుంబానికి రేషన్ కార్డు కావాలన్నా అధికార టీడీపీ వారు సైతం జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవాల్సి వచ్చేదన్నారు. కానీ సీఎం జగన్ నాయకత్వంలోని నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎన్నో ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయగా వాటిని ఎటువంటి పక్షపాతం లేకుండా, అర్హత కలిగిన ప్రతిపక్ష పార్టీల వారికి సైతం ఎక్కడికీ తిరగాల్సిన అవసరం లేకుండా అందించారన్నారు. దాంతో మాలాంటి పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక అవసరాలు తీరాయన్నారు. ఏ విధమైన ప్రయోజనం లేని టీడీపీలో కొనసాగే కంటే ప్రజా ప్రయోజనాలు కాపాడే వైఎస్సార్ సీపీకి, నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండే జగ్గిరెడ్డికి మద్దతుగా నిలవాలని తీర్మానించుకున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో మిమ్మల్ని గెలిపిస్తాం అని జగ్గిరెడ్డికి మాటిచ్చారు. అనంతరం పార్టీలో చేరిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు దూనబోయిన సత్యనారాయణ, వాసంశెట్టి గణేష్, మణికంఠ (కన్నా), సంతోష్‌కుమార్, సత్యనారాయణ, కొప్పిశెట్టి శ్రీను, కడలి ఆంజనేయులు, దూనబోయిన సూర్యానారాయణ, వాసంశెట్టి నాగవరలక్ష్మి, దూనబోయిన అనంతలక్ష్మి, చింతాకుల లక్ష్మి, కడలి దేవిదుర్గ, ధనలక్ష్మి, వాసంశెట్టి కనకదుర్గ, సుబ్బలక్ష్మి తదితరులకు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబం పూర్వం నుంచీ రాజకీయాలకు అతీతంగా ప్రజాభిమానం పొందడం మా పూర్వ జన్మ సుకృతం అన్నారు. నియోజకవర్గంలో అల్పసంఖ్యాక వర్గానికి చెందిన వారమైనా పట్టం కడుతున్న ప్రజానీకానికి ఎప్పుడూ అందుబాటులోనే ఉన్నామని, భవిష్యత్‌లో కూడా ప్రజల్లోనే ఉంటామని అన్నారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా, ఏ అవసరం వచ్చినా నా ఇంటి తలుపులు తెరిచే ఉంటాయన్నారు. కార్యక్రమంలో అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఖండ్రిగ మాజీ సర్పంచ్ పితాని రాంబాబు, మోడేకుర్రు వీడీసీ కన్వీనర్ కుడుపూడి వెంకటేశ్వరరావు, మండల ఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విజయమివ్వు విఘ్నేశ్వరా..



అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు తదితరులు

**అయినవిల్లి:** స్థానిక విఘ్నేశ్వరస్వామికి అమలాపురం నియోజకవర్గ పార్లమెంట్ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు శనివారం పూజలు చేశారు. వరప్రసాదరావుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలతో స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో రాపాక వరప్రసాదరావు స్వామికి విశేష పూజలు చేశారు. అర్చకులు ఆయనను ఆశీర్వదించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు. ఆయన పాలనలో రాష్ట్రంలో సంక్షేమ సక్రమంగా అమలయిందన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అత్యధిక సీట్లు కైవశం చేసుకోవాలని సీఎం పీఠంపై జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కాలని, తను ఎంపీగా గెలవాలని పూజలు చేశారు. ఆయన వెంట స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, అమలాపురం ఎంపీ చింతా అనురాధ తదితరులు ఉన్నారు. అనంతరం మాగాంలో కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, నాయకులు పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, పార్టీ నాయకులు వాసంశెట్టి తాతాజీ, పి.రఘురామరాజు, కేఎస్ఎన్ రాజు, మంగళపల్లి అంజిబాబు, కటకంశెట్టి ఆదిత్యకుమార్, కశిరెడ్డి అంజిబాబు, పేరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ భావజాలాన్ని విశ్వవ్యాప్తం చేయాలి

**మామిడికుదురు:** అంబేడ్కర్ భావ జాలాన్ని విశ్వవ్యాప్తం చేయాలని ప్రముఖ సినీ గేయ రచయిత మాస్టర్జీ పేర్కొన్నారు. మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విజ్ఞాన వేదిక ద్వారా జ్ఞానాన్ని పెంపొందించాలని, తద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలన్నదే తన లక్ష్యమన్నారు. ప్రజల్లో ఐకమత్యం కావాలన్న మూల్ నివాసీ సిద్ధాంతాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. సినీ గేయాలు ఆలపించి సభికులను రంజింపచేశారు. ముందుగా బోయి భీమన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గొస్ మొహిద్దీన్, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, నీతిపూడి చంద్రరావు, భూపతి వెంకటపతి, కలిగితి పళ్లంరాజు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వెంకటరెడ్డి జయంతి

**కొత్తపేట:** శెట్టిబలిజ జాతిపితగా ప్రసిద్ధి చెందిన బర్మాకేసరి, విద్యావేత్త దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని కొత్తపేటలో శెట్టిబలిజ యూత్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో విభిన్న ప్రతిభావంతులకు, వృద్ధులకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువజన సంఘం అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, సభ్యులు శీలం కొండబాబు, ముషిణి వెంకటరమణ, కముజు తాతాజీ, కడలి బీమా తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీ విజయమే మాదిగల లక్ష్యం



కత్తిమండలో ఎంపీ అభ్యర్థి రాపాకతో భేటీ అయిన ఎమ్మెల్సీ ఇస్రాయేల్

**మలికిపురం:** వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే మాదిగల లక్ష్యమని ఎమ్మెల్సీ బొమ్మి ఇస్రాయేల్ పేర్కొన్నారు. రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం కాలనీలో 'వైఎస్సార్ సీపీ' విజయం కోసం ప్రచారంలో భాగంగా బాబూ జగ్జీవన్‌రామ్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శెట్టెం శ్రీనివాస్‌స్వామి (బుజ్జి) అధ్యక్షతన జరిగింది. ఇస్రాయేల్ మాట్లాడుతూ మాదిగలను సమీకరించి, వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని తెలియజేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో దళితులు, బడుగు, బలహీన వర్గాల వారు వైఎస్సార్ సీపీకి అండగా ఉండి వైఎస్ జగన్ బలపరిచిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులైన గొల్లపల్లి సూర్యారావు, రాపాక వరప్రసాదరావులను అఖండ మెజారిటీతో గెలిపించుకుని, తద్వారా వైఎస్ జగన్‌ని మళ్లీ ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రానికి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చేట్ల సత్యనారాయణ, ముస్కుడి భాస్కరరావు, విశ్వేశ్వరపురం బాబు, తెన్నేటి నాగేశ్వరరావు, ఆకుమర్తి నాగేశ్వరరావు, మంద రవి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావును ఎమ్మెల్సీ ఇస్రాయేల్ కత్తిమండ క్యాంపు కార్యాలంలో కలిశారు. పార్టీ విజయానికి చేయాల్సిన కృషిపై చర్చించారు.

# పేదల సంక్షేమమే ధ్యేయంగా జగన్ పాలన



అంతర్వేది దేవస్థానంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రాపాక, గొల్లపల్లి

**సఖినేటిపల్లి:** రాష్ట్రంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిందని వైఎస్సార్ సీపీ అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావులు అన్నారు. శనివారం అంతర్వేది దేవస్థానంలో ఆ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు జల్లి వాసు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు మాట్లాడుతూ, చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అమలు చేసి మనకు మంచి చేసిన జగనన్నను సీఎం చేసుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఏ వర్గానికి అన్యాయం జరగకుండా ప్రతి వర్గానికి న్యాయం చేసిన ఘనత కూడా వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన నేత జగనన్న ఒక్కరే అన్నారు. రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ, పథకాలు యథాతథంగా అమలు చేసుకునేందుకు వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. దేశ చరిత్రలోనే మహిళలకు అత్యంత ప్రాధాన్యమిస్తూ, నిత్యం సంక్షేమ పథకాల ద్వారా వారి ఆర్థికాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. మహిళల కుటుంబాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేశారన్నారు. అమలాపురం, రాజోలులో వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడేలా కృషి చేయాలని కేడర్‌ను ఆయన కోరారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, పార్టీ సీనియర్ నాయకుడు కేఎస్ఎన్ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, నాయకులు నల్లి డేవిడ్, ఈద రవిరెడ్డి, ఇంటిపల్లి బుజ్జి, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సీపీకి ప్రజల బ్రహ్మరథం



అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాకను అభినందిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

**మామిడికుదురు:** వైఎస్సార్ సీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అమలాపురం ఎంపీ చింతా అనురాధ, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో శనివారం ఎమ్మెల్యే చిట్టిబాబును అతని స్వగృహం వద్ద ఎంపీ అనురాధ, ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల్లో ఆయనకు విశేషమైన ఆదరణ కల్పించాయన్నారు. ఎన్నికల్లో సంక్షేమ పథకాలే గెలుపునకు నాంది కాబోతున్నాయన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు చేసినా, ఎంతగా దుష్ప్రచారం చేసినా ఎన్నికల్లో విజయం వైఎస్సార్ సీపీదేనన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, పార్టీ నేతలు కటకంశెట్టి ఆదిత్య, తెన్నేటి కిశోర్, కంచర్ల బాబి, మట్టపర్తి శివ, కొండేటి వెంకటేశ్వరరావు, కొండేటి వికాస్‌బాబు, కుసుమ హర్ష పాల్గొన్నారు.

### ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

**ఆలమూరు:** గ్రామంలోని ఏటిగట్టు రోడ్డులో ఓదుల పల్లి రమేష్‌బాబు (45) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. స్థానిక ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం అనంతపురం జిల్లా వేములవారిపల్లెకు చెందిన రమేష్‌బాబు గత కొంత కాలంగా గ్రామంలో నివసిస్తున్న సోదరుడు రామకృష్ణ వద్ద నివాసం ఉంటున్నాడు. అతడికి తల్లిదండ్రులు లేకపోవడంతో సోదరుడు రామకృష్ణ తన తమ్ముడి బాధ్యతలు చూసుకుంటున్నాడు. అయితే ఇటీవల చెడు వ్యవసనాలకు బానిసై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈనెల 19న సోదరుడు రామకృష్ణ వద్దకు వచ్చి కొంత సొమ్ము కావాలని అడిగి తీసుకువెళ్లాడు. అప్పటి నుంచి మృతుడు రమేష్ కనపడకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్రంగా గాలించారు. స్థానిక కాలిబాట వంతెన సమీపంలోని ఏటిగట్టు పక్కన ఉన్న మామిడిచెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా మారాడు. స్థానికుల ఇచ్చిన సమాచారంతో ఎస్సై శ్రీను నాయక్ కేసును నమోదు చేయగా రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



పి.గన్నవరంలో కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు

**పి.గన్నవరం:** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం పి.గన్నవరం, డీఎస్ పాలెం, లంకల గన్నవరం ప్రాంతాల్లో ఎస్సై బి.శివకృష్ణ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఎస్సై శివకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను తప్పని సరిగా పాటించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు సర్టిఫికెట్ కోర్సులు



కొత్తపేట డిగ్రీ కళాశాల సర్టిఫికెట్ కోర్సుల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి

**కొత్తపేట:** విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు సర్టిఫికెట్ కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. డిగ్రీ కళాశాలలో రెగ్యులర్ తరగతులతో కమ్యూనికేషన్ స్కిల్స్, వెబ్ డిజైనింగ్, ఈక్వేషన్ ఎడిటర్ సాఫ్ట్‌వేర్ టూల్స్, అడ్వాన్స్ స్పెక్ట్రో టెక్నిక్స్, బేసిక్ కాటం మెకానిక్స్, బయోటెక్నోలాజికల్ టూల్స్ అండ్ టెక్నిక్స్, యోగా అండ్ మెడిటేషన్ కాన్స్టిట్యూషనల్ అమెండ్‌మెంట్స్ (రాజ్యాంగ సవరణలు), బుద్ధిజం, భాగవత స్కందాలు భక్తి పరిచయం తదితర కోర్సులను శనివారం ప్రిన్సిపాల్ పెద్దిరాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో రెగ్యులర్ తరగతులతో పాటు విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పై సర్టిఫికెట్ కోర్సులు ప్రారంభించామన్నారు. విద్యార్థులు వివిధ సమకాలీన అంశాలపై ప్రావీణ్యతను సాధించుటకు ఈ కోర్సులు దోహదపడతాయన్నారు. సర్టిఫికెట్ కాలవ్యవధి 30 రోజులు కాగా ప్రతిరోజూ రెగ్యులర్ క్లాసులు ముగిసిన తరువాత సాయంత్రం క్లాసులు నిర్వహిస్తారన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

### త్యాగరాజ సంగీత సభకు ఏర్పాట్లు

**రాజోలు:** ఈ నెల 26వ తేదీన రాజోలు బిల్డింగ్ సొసైటీ భవనంలో జరిగే శ్రీ త్యాగరాజ సంగీత సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు శనివారం ఆహ్వాన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 26న ఉదయం రాజోలు పురవీధుల్లో నగరం సంకీర్తన, త్యాగరాజ పంచరత్న కీర్తనల బృందగానం, మధ్యాహ్నం యానాంకు చెందిన టీవీఎస్ ప్రసాద్ శిష్య బృందం వయొలిన్ వాద్యం, సాయంత్రం తెనాలికి చెందిన ప్రముఖ వీణ విద్వాంసురాలు పుచ్చా కనకదుర్గ వీణ కచేరీ, జిన్నూరు శ్రీ సిద్ధి వినాయక నృత్య కళానిలయం వారి కూచిపూడి నాట్య ప్రదర్శన జరుగుతుందన్నారు.

# వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

**అయినవిల్లి:** మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం బక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేద పండితుల స్వామికి తులసిపూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్న దానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం మొక్కుబడి చెల్లించారు.

# వేద మార్గంతో ముక్తి సాధ్యం

**ఆలమూరు:** వేదం చెప్పిన ధర్మ సూత్రాలను అనుసరిస్తూ జీవనం గడపడం ద్వారా ముక్తినిచ్చే మోక్షాన్ని పొందవచ్చని టీటీడీ ఆస్థాన పండితుడు, బ్రహ్మశ్రీ కుప్పా విశ్వనాథశర్మ తెలిపారు. మండలంలోని పెదపళ్ల తూర్పు వీధి రామాలయం వద్ద శనివారం రాత్రి జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఆయన పాల్గొని తమ అమూల్య ప్రవచనాన్ని భక్తులకు బోధించారు. జీవన గమనంలో మోక్షాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ సత్యాన్ని పాటించి ధర్మాన్ని ఆచరించమని వేదం చెబుతుందన్నారు. గ్రామంలో ఒకేసారి వేణుగోపాలస్వామి, శ్రీరామచంద్రమూర్తి ఆలయ మందిరాల్లో నూతన శిలా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామమని ఆయన వ్యాఖ్యానించారు. అనంతరం విశ్వనాథ శర్మను గ్రామానికి చెందిన కాకర్లమూడి చిట్టిబాబు, అన్నపూర్ణ దంపతులు ఘనంగా సత్కరించారు.

### భగత్‌సింగ్ వర్ధంతి

**పి.గన్నవరం:** మమత స్వచ్ఛంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో నరేంద్రపురం శివారు గుత్తులవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి, నివాళులర్పించారు. భగత్‌సింగ్ దేశానికి అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. అలాగే పి.గన్నవరం అక్విడెక్టు పార్కులో భగత్‌సింగ్ విగ్రహానికి జాన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. కార్యక్రమాల్లో కె.షణ్ముఖరావు, వడలి రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# వాతావరణ దినోత్సవంపై అవగాహన సదస్సు



సఖినేటిపలిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మానవహారం

**సఖినేటిపల్లి:** ఎర్త్ అవర్ అనేది ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించే వాతావరణ దినోత్సవమని ఏపీ ఎన్జీసీ స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ జి.ప్రభావతి అన్నారు. శనివారం సఖినేటిపల్లిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో భూమిని కాపాడుకుందాం, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం అంటూ విద్యార్థులతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకతను ఆమె వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గ్లోబల్ వార్మింగ్ కారణంగా జీవరాశి ఉనికి ప్రశ్నార్థకంగా మారినందున భూమిని, పర్యావరణాన్ని కాపాడుకోవాలన్నారు. ఎర్త్ అవర్ అంటే ఓ గంటపాటు విద్యుత్ వినియోగం ఆపేయడమే అన్నారు. కరెంటు బల్బులు, టీవీలు, కంప్యూటర్లు వంటివి ఉపకరణాలన్నీ కూడా కాసేపు స్విచ్ ఆఫ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇలా విద్యుత్ ఆదా చేస్తే ఆ మేరకు భూ వాతావరణాన్ని పరిరక్షించినట్టేనని ఆమె చెప్పారు. బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగిన శ్రీవారు



స్వామిని సూర్యప్రభ వాహనంపై ఊరేగిస్తున్న గోవిందమాలధారులు

**రావులపాలెం:** అలమేలు మంగా పద్మావతి అండాళ్ సహిత వేంకటేశ్వరస్వామి 15వ వార్షిక నవాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడోరోజు శనివారం స్వామి వారికి సూర్య ప్రభ, చంద్రప్రభ వాహనోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుతగా బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఉదయానే సుప్రభాత సేవ, సహస్ర నామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతం స్వామిని సూర్యప్రభ వాహనంపై గోవిందమాలధారులు పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకు వాడపల్లి కమలనాథ్ ఆచార్యులు ఆధ్వర్యంలో పలు పూజలు జరిపారు. రాత్రికి స్వామికి చంద్రప్రభ వాహనోత్సవం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఏర్పాట్లను దేవస్థాన పాలక మండలి చైర్మన్ పడాల పెదవెంకటరెడ్డి ఇతర సభ్యులు పర్యవేక్షించారు.

### బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

**అయినవిల్లి:** బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. దీనికి సంబంధించి ఎస్సై బి.రాజేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపేటకు చెందిన మోతా వీరవెంకట సత్యవరప్రసాద్ తన బైక్‌పై అమలాపురం నుంచి అయినవిల్లి మండలం నల్లచెరువు మీదుగా కొత్తపేట వెళ్తున్నాడు. అతన్ని ఓ మోటార్ సైక్లిస్టు వేగంగా వచ్చి ఢీకొన్నాడు. గాయాలైన సత్యవరప్రసాద్‌ను స్థానికులు వైద్యం కోసం అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుడు సత్యవరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.